# కవితా కౌముది

శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
22 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## అతడిని నాకు తెలుసు

డా. నారాయణ గరిమెళ్ళ

అతడిని నాకు తెలుసు

భూములూ గొంతులూ
దాహార్తులై వర్షం కోసం
మొక్కే వేళ

అతడు సముద్రాన్ని
తియ్యగా మారి
దాహార్తుల కడకు రమ్మంటాడు

అరచేతిలో మర్రి విత్తనం
ఉన్న భాగ్యానికే
అతడా మ్రాను క్రింద
సంతర్పణ చేస్తున్నట్టు స్వప్నిస్తాడు

ప్రవాహాన్ని దాటడానికి
మనిషే వంతెన కాగలిగే
మహత్తర విద్య అతనికి తెలుసు

సూర్యుడి కాంతికి
మొక్కలు కిరణజన్యాన్ని సాగించినట్టు
పరిమితులనుండే
అపరిమితాన్ని ఆవిష్కరిస్తానంటాడు

అతడిని నాకు తెలుసు
అతని చేతులు పెద్దవి
హృదయం గొప్పది

ఈ రోజు కాకున్నా
మరో రోజైనా
అనుకున్నవన్నీ సాధించే తీరుతాడు

***

## వెలితి

పన్నాల రఘురామ్

ఒక రాత్రి వేళ అమ్మ నా పక్కన కూర్చొని పిలిచినట్లుంది
అమ్మమ్మ పాట పాడినట్లు అనిపించింది

ఎండాకాలం సెలవలు, ఎటు చూసినా చుట్టాల సందడి
మామయ్య వాకిట్లోంచి సైకిల్ బెల్ కొట్టినట్లుంది
సీతాఫలాల, సీమచింతకాయల, ముంజల వాసనలు వచ్చినట్లుంది
తిరునాళ్ళలో కొని దాచుకొన్న నెమలి ఈక ముఖాన రాసినట్లయ్యింది
మా ఊరి సముద్రంలో ఆడినట్లుంది, కాళ్ళకి అంటిన ఇసుక ఇంకా గుచ్చుకుంటునట్లుంది
వేసవి కాలం వాన ముందు మట్టి వాసన పిల్చినట్లుంది
నీడ కోసం చెట్టుకింద నుంచొని వానలో అక్కడ అక్కడ తడిసినట్లుంది

కళ్ళని అల్లుకుంటున్న వెలుగులు, చెవిలో మాటల రొదలు, దగ్గరగా, దూరంగా శబ్దాలు
అత్తయ్య ఏదో చెప్పి చెప్పి నవ్వుతోంది, పిన్ని పిలిచి పిలిచి అలిసిపోతోంది,
గలగలలు, కలకలలు, కోలాహలం, కలగాపులగం
పెరట్లో భోజనాలు, మామిడిపండు కోసం కుస్తీలు, మజ్జిగ కాదు పెరుగు అని వాదాలు

మల్లెపూల వాసనలు, రాతిరి వెలుగులు, మబ్బుల నీడలు
పొరుగింట్లో రేడియోలోనుంచి పాత పాటలు, రయ్యిన సాగే హౌరా మెయిలు కూతలు
డాబా మీద పక్కలు, దయ్యాల కథలు, అంత్యాక్షరి ఆటలు, చప్పట్లు, తాళాలు
చద్దన్నం ముద్దలు, వెటకారం మాటలు, వీపు మీద గుద్దులు, అమ్మమ్మ సుద్దులు
కాలవ గట్లపై నడకలు, వేరుశనగ వేర్లు, దొరువుల్లో ఆటలు,చెక్క రిక్షా సవారీలు
కొన్ని తలఁపులు బ్రతుకు బండికి ఇరుసులు, జీవిత నావ జారకుండా కాచే లంగరులు
మరికొన్ని స్మృతులు బ్రతుకు బాటలో అంటిన కల్మషాన్ని కాల్చే నిప్పు రవ్వలు

బావి దగ్గర తలంటు లాగా జ్ఞాపకాల చేదతో మనసు స్నానం చేస్తోంది
పిన్ని పోసిన కుంకుడు రసం కంట్లో పడింది
పరీక్షకి ఆలస్యమైంది, అడవికి నిప్పంటుకుంది
ఒక్కడినే పరుగెడుతున్నా, గొంతు తడారిపోతోంది
తన జుట్టు నా ముఖం మీద పడింది,
మెలుకువ వచ్చింది, ఫోన్లో టైం నాలుగయింది
స్వప్నాల సాగు చింతనిస్తుంది, శాంతినిస్తుంది
ఆనందం ఆవిరౌతున్నట్లు అనిపించింది
వెలితిగా అనిపించింది, కలతగా అనిపించింది

అరవై ఏళ్ళొచ్చినా అమ్మే అందం
ఎన్నాళ్ళయినా ఆమె గుర్తుగా మా ఊరే బంధం
మా ఊరి తలపు మదిలో తామరల సౌరు
హృదయాన చెమ్మలూరు, కళ్ళల్లో చిప్పిల్లు నీరు
పంచవన్నెల జలతారు, వెన్నెల్లో షికారు
మదిలో హుషారు, భళ్ళున తెల్లారు
ఖండాంతరములలో కొనసాగే జీవన పోరు

****

# అద్వైతము

డా.మూర్తి జొన్నలగెడ్డ

శిల, శిల్పం నీవి ... శైలి నాది
కలం, కాగితం నీవి ... వ్రాత నాది
నారు, నీరు నీవి ... పైరు నాది
దేహం, ప్రాణం నీవి ... జీవితం నాది
మార్గం, గమ్యం నీవి ... పయనం నాది
విధి నీవు, విధించునది నీవు
ఎంతో నీవు, కొంత నేను
ఆ కొంత నీవే ఇచ్చి, సర్వం నీవైనావు!
నా లోన నిను నింపి
నా మానాన నను పంపి
దూర భారముల నా వెంటనుండి
నా కర్మ ఫలములకు సాక్షివైయుండి
నా పాత్ర ముగిశాక రంగమ్ము నుండి
నిష్క్రమింప జేయు నిర్దేశకుండా!
తిరిగి నీ చెంతకు నను చేరనిచ్చి
ఈ మనుజునకు దైవత్వమొసగినావా!
నాకిపుడు తెలిసేను! నాకిపుడు తెలిసేను!!
గట్టి పుణ్యముల్ సల్పిన గాని
ఘనమైన ఈ జన్మ వట్టి దుర్లభమని
అట్టి జన్మ నిరర్ధకమైన, కడు వ్యర్ధమేనని
యత్నమున జన్మ సార్ధకత సాధ్యమేనని

****

# మొగలిరేకులు

రమాకాంత్ రెడ్డి

ఆమె – అలుపెరుగని ఆమని కోకిల
అతను – రససిద్ధి

అతను – అనంత అగాధ భావసముద్రం
ఆమె – పెనుతుఫాను

ఆమె – అమలిన శృంగార కావ్యమందారం
అతను – మధుపం

అతను – విశాల శరదృతు హృదయగగనం
ఆమె – నిండుజాబిల్లి

ఆమె – సురూపలావణ్య సౌందర్యనిధి
అతను – బందిపోటు

అతను – నవరసరాగసుధామృత పిపాసి
ఆమె – రుద్రవీణ

ఆమె – దారి తప్పిన ఒంటరి బాటసారి
అతను – ధృవతార

అతను – కాంక్షాప్రజ్వలిత ఉజ్వలహృదయం
ఆమె – కొండవాగు

ఆమె – పున్నమి రాత్రి పలుకరించే ప్రణయసమీరం
అతను – తమకం

అతను – వెలిసిపోవు విరిజల్లుని ముద్దాడే నీరెండ
ఆమె – హరివిల్లు

****

శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
22 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
నా మొట్టమొదటి కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

# నవసంవత్సరాగమనం

నేమాని సోమయాజులు

దిక్కులన్నిటయున్న సుందర దృశ్యముల్ తిలకించుచున్
రెక్కలూపుచు సంతసమ్మున లేతమావి చిగుళ్లకున్
ప్రక్క చేరిన మత్తకోకిల పారవశ్యము తోడనే
చక్కనైన పదమ్ముపాడెను శ్రావ్యమైన గళమ్ముతో ‖ 1. మత్తకోకిల

నవవర్షాగమనంబు కల్లె బహుధానందప్రభాపుంజమై
భువిపై వచ్చె వసంతమింక కలిగెన్ మోద మ్మమేయమ్ముగా
కవిలోకమ్మున జాలువారె కవితల్ గంగాప్రవాహమ్ములై
యవినీతిన్ నశియింపు నెంచిరి జనుల్ హర్షాతిరేకమ్ముతో ‖ 2. మత్తేభము

నూతనవత్సరంబిది వినూతనశోభలతోడ వచ్చెనే
పాతదినమ్ములందుగల బాధలు కష్టములు న్నశింపగా
యాతనలన్ని పోవగ సుఖాంబుధినందున తేలియాడగా
నీతియు ప్రేమబంధముల నిత్యము వర్ధిలు మంచు నెల్లరిన్ ‖ 3. ఉత్పలమాల

ఈ నూత్నాబ్దమునందు సర్వశుభముల్ హేలాగతిన్ గల్గగా
నీ నూత్నాబ్దమునందు పంట కృషకుల్ హెచ్చింప వేగమ్ముగా
నీ నూత్నాబ్దమునందు బాధలు కృపాదృష్టిన్ నివారింపగా
నీ నూత్నాబ్దమునందు వేడెదను రావేలా దయాసాగరా! ‖ 4. శార్దూలము

చలి విపరీతమై కలుగు సాంద్రహిమమ్ముల ధార నిత్యమున్
నిలచును మంచుపూత ధరణీతలమందున నాల్గుమాసముల్
చెలగెడి కాలమందు మొలిసెంగద సన్నని యాశ మిన్కులా
కలిగెను రాక యీ యమెరికా నగరమ్ముల హేవళంబికిన్ | 5. చంపకమాల

మోడువారిన వృక్షముల్ మొగ్గ దొడిగె

పచ్చికలు దొల్చె లేతాకు పచ్చదనము
పుడమితల్లియు నెంతయో పులకరించె
వచ్చె సుఖదమై నూతనవత్సరంబు ‖ ౬. తేటగీతి

కాల మెవ్వరి కొరకు నాగ దను మాట
కల్ల కాదని తెలుపంగ నెల్లరికిని
కఠిన కర్కశహృదయమ్ము కల్గి నట్టి
దుర్ముఖిక నిష్క్రమింపంగ దొడగె వడిగ ‖ 7. తేటగీతి

హెచ్చింపగ సంతోషము
పొచ్చెమ్మలు బాధ లుడిగిపోవగ నిలలో
మెచ్చగ పశుపక్ష్యాదులు
వచ్చెంగద హేవళంబి వత్సర మింకన్ ‖ 8. కందము

పతిత దీన జనుల బాధ నివారణ
తాపసులకు దైవదర్శనంబు
సకల మానవులకు సౌఖ్య సంతోషంబు
లీయవలయు నింక హేవళంబి ‖ ౯. ఆటవెలది

★★★★

# హంపీ వైభవం

శ్రద్ధ కొమాండూరి

శివకేశవుల నేల,
విజయనగరపురీ హేల
ఏకశిల నందితో, గోపురపు గుడిలో
కొలువు తీరినాడు శ్రీ విరూపాక్షుండు.
ఎన్నెన్ని లింగాలు,
అడుగడుగు జంగాలు
రాళ్ళు పుణ్యవశాన లింగాలుగా మారి
రాయలేలిన విజయరత్నసీమ
శిలలె శిల్పాలైన ధన్యసీమ.
వర్ణనకు అందని సృజనాత్మకతతో

సౌందర్య జీవకళ సొబగులీనే తీరు
చూచి యే తీరాలి, అనుభవించాలి
కనులు, మెదడూ, మనసు కలిపి ఒకటేసారి
ఆజానుబాహుడె భీకరుడు కాడు
ఈ ఉగ్రనరసింహుడు
"ఏకశిల నుండి నను మలిచినారోయి'
అనుచు పిలుచుచున్నాడు చూడ రారమ్మనుచు.
విఠల మందిరమదియు విభవ సాగరమే
విలసిలనచటెన్నో నాదస్థంభములు
సార్వభౌముని విజయకాంక్షా మనోరథమ్ము
తూరుపున అదిగో అచ్చెరువుల రాతిరథమ్ము
భక్త పురందరుని పుణ్యమంటపమ్ము
విజయపరంపరల భవ్య స్మృతిసౌధమ్ము
ఆంధ్రభోజుడు తాను ఆసనమధివేష్టించి
నవరాత్రి సంబరము తిలకించెగా
పురజనుల హృదయాలు పులకించగా,
భావలాలిత్యమే గాక మార్దవమును
నాపరాతిలో పలికించి సొగసులొలికించే
శిల్పకారుడి సృజన సృష్టికే పరాకాష్ఠ
హంపీ కళాజగత్తుకు అతడు అతడే స్రష్ట.
హజార రామస్వామి సన్నిధికి చేరి
"మూరు రాయరగండ మొక్కులిడుచుండ"
రాతిగోడలు రామాయణ గానమ్ము చేసె
'ఇది కిష్కంధ' అని ప్రజలు తలపోసె
నవబృందావన మదిగో సాధుసమాధి స్థలము
సాధుజనస్ఫూర్తి సజీవమని లోకవిశ్వాసమ్ము
"రాజశేఖరుని త్రాసు' మహరాజుతో పాటు
ధనధాన్యముల తూచి పంచు పేదలకు
ఏబదడుగుల పొడవు, ఆరడగు లోతు
అద్భుతము మహరాణి జలక్రీడా గృహమ్ము
రాలపూచిన తామరలు పన్నీటి తుంపరలు వెదజలు
రాణివాసపు స్నానఘుట్టమదిగో.
పై గోపురమా అది? కాదు, శిల మొలిచిన పద్మము
కళాకృతుల వన్నెచిన్నెల శిలలతోరణము
సొబగులీనే రెండంచెల కట్టడము
రాణివాసపు మేలి వేసవివాసమ్ము
'కమల మహలు' ఎండెరుగని విడిదిగృహము.
ఏర్పడి ఉన్నది చూడుడు "ఏనుగులశాల"

పదకొండు మదపుటేనుగుల సంరక్షణార్థమై
అచటి శిల్పసంపద రెండు మతముల మేళవింపు
"మత సామరస్యము మరువకండ"ని చెప్పకనె చెప్ప.
రండి, చూడండి దివ్య పుష్కరిణి
శ్రద్ధాళువుల స్నాన ఘట్ట భరిణి
మహానవమి దిబ్బ అను గొప్పకట్టడము
రాజ పరివారమిచట కొలువై తిలకించు మహానాడు ఉత్సవము.
నడచి చూదాము రారండి నడి 'బజారు'
నిలువెత్తు రాతి స్థంభాల నడుమ తనరారు
ప్రోగు పోసుకుని రత్న మాణిక్యరాసులను
అరుదైన, విలువైన వెన్నొ దినుసులను
దేశాంతర వ్యాపార వణికోత్తములిచట
దోసిళ్ళ లెక్కతో తూచి అమ్మెడివారట.
ఐశ్వర్య శ్రీలు ఆనందతాండవమాడిన
అపరంజి, అపురూప వీధులివిగో
శిల్ప, సాహిత్య, సంగీత కళలు మాత్రమె గాదు
ఆధ్యాత్మిక, భక్తి భావనల కాణాచి
రాజభక్తుల, శక్తియుకుల
యుద్ధవ్యూహ, నిర్దిష్ట రణనీతుల
కేంద్రబిందువిదియె హంపి విజయనగర సామ్రాజ్య జీవనాడి.
కవిత్రయమ్మలంకరించిన భువనవిజయమ్ము
ఆముక్తమాల్యద అనెడి విష్ణుచిత్రీయము
కాళి కరుణించిన రామలింగని వికటకవితనము
స్వామిభక్తి, దేశానురక్షి మూర్తీభవించిన తిమ్మరుసు హృదయమ్ము
స్వర్ణయుగమునెడిది చాలా చిన్నమాట
భాష పరిమితికి లోబడి అన్నమాట
మునుపు చూసింది ఒక్కటే ఒక్కసారె
ముందెన్నడిక పైన చూడబోము.
నాటి పంపా సరస్సు నేటి తుంగభద్ర
గత వైభవ ప్రభకు ప్రత్యక్ష సాక్ష్యమ్ము
జీవనదియై ఆంధ్రకర్ణాటకముల చేయు పావనమ్ము
ఐదు దశాబ్దాల అఖండ యశోతేజమ్ము
హంపీ వైభవము, హంపీ నీ వైభవమ్ము!

COMMENTS